
క్లుప్తంగా

ఉప్పుటేరులోకి దూసుకెళ్లిన కారు

తప్పిన పెను ప్రమాదం



శ్రీలంవారిపాలెం వద్ద ఉప్పుటేరులోకి దూసుకువెళ్లిన కారు

కొత్తపల్లి: మండలంలోని కోనపాపపేట–ఉప్పాడ బీచ్ రోడ్డులో శ్రీలంవారిపాలెం బ్రిడ్జి వద్ద సోమవారం ఓ కారు ప్రమాదవశాత్తూ అదుపుతప్పి ఉప్పుటేరులోకి దూసుకువెళ్లింది. వివరాల్లోకి వెళితే... తొండంగి మండలం ఏవీ నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో కాకినాడ వెళ్తున్నారు. మండలంలోని శ్రీలంవారిపాలెం బ్రిడ్జి వద్ద కారు అదుపుతప్పి ఉప్పుటేరులోకి దూసుకుపోయింది. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులూ స్థానికుల సాయంతో సురక్షితంగా బయటపడ్డారు.

పీజీడీఎంలో దేవులపల్లికి స్వర్ణ పతకం



ధ్రువపత్రాన్ని అందుకుంటున్న వెంకటశాస్త్రి

పెద్దాపురం: తెలంగాణ రాష్ట్రంలో విద్యనభ్యసిస్తున్న పట్టణ వాసి దేవులపల్లి సాయి వెంకటశాస్త్రి పీజీ డిప్లొమో మేనేజ్‌మెంట్ కోర్సులో స్వర్ణ పతకం సాధించాడు. 2024 బ్యాచ్‌కు చెందిన ఆయన హైదరాబాద్‌లో జరిగిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (ఐపీఈ) కార్యక్రమంలో ఈ పతకాన్ని అందుకున్నారు. పట్టణంలో ప్రసిద్ధి చెందిన దేవులపల్లి వెంకటశాస్త్రి మనుమడు, దేవుపల్లి ప్రకాష్ ఉమాదేవి దంపతుల తనయుడు బంగారు పతకం సాధించడం పట్ల పట్టణ బ్రాహ్మణ సంఘం సభ్యులు, పలువురు న్యాయవాదులు అతడిని ప్రత్యేకంగా అభినందించారు.

తలరాత మారాలంటే చేతిరాత మారాలి

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



మంచి చేతిరాతను చూపిస్తున్న మంత్రి దుర్గేష్ తదితరులు

పిఠాపురం: విద్యార్థుల తలరాత మారాలంటే ముందు చేతి రాత మారాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో బ్రోస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన చేతిరాత నైపుణ్య అభివృద్ధి కార్యక్రమంలో జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి మర్రెడ్డి శ్రీనివాస్, కుడా చైర్మన్ తుమ్మల బాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి చేతిరాత అందంగా రాస్తే వారి జీవితం కూడా అందమైన అక్షరాల వలే అత్యంత అద్భుతంగా ఉంటుందన్నారు. విద్యార్థులు మంచి చేతివ్రాతను అలవర్చుకోవడం ద్వారా మంచి భవిష్యత్తును పొందవచ్చన్నారు. గత ఐదేళ్లలో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడానికి ఎటువంటి కార్యక్రమాలు జరగలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సృజనాత్మకత పెంచడానికి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పిఠాపురం ప్రభుత్వాస్పత్రి పడకల సామర్థ్యం 100కు పెంపు

సాక్షి, అమరావతి: కాకినాడ జిల్లాలోని 30 పడకల పిఠాపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ సోమవారం వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు ఇచ్చారు. 66 అదనపు పోస్టులను మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. ఆస్పత్రి అప్‌గ్రేడ్ చేయడానికి రూ.38.32 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసినట్టు వివరించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: రైతుల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మాధవపట్నంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 11 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు.

కొనుగోళ్లు డల్.. కష్టాలు ఫుల్

- జోరుగా ఖరీఫ్ పంట ఒబ్బిడి పనులు
- కొనుగోళ్లు లేకపోవడంతో కళ్లాల్లోనే ధాన్యం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- నియోజకవర్గంలో 42 వేల ఎకరాల్లో వరిసాగు



పిఠాపురం: ప్రస్తుతం వ్యవసాయం గాలిలో దీపంలా మారింది. ఎప్పుడు ఏ కష్టం వచ్చిపడుతుందో అన్నదాతలకు తెలియడం లేదు. పంట ఇంటికి చేరితేనే ఆ ఏడాది రైతుకు పంట పండినట్టు. ఇక ప్రకృతి వైపరీత్యాలు వస్తే నష్టాలు తప్పనిసరి. ఇలాంటి పరిస్థితుల్లో పండిన పంటను ఒబ్బిడి చేసుకుని అమ్మకాల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతకు చేదు అనుభవం ఎదరవుతోంది. పిఠాపురం నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 42 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా ఏలేరు వరదల కారణంగా సగానికి పైగా విస్తీర్ణంలో వరి పంట దెబ్బతింది. మిగిలిన పంటను రైతులు కోసి నూర్చి అమ్ముకోడానికి ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ఎక్కడా వాటి ఆనవాళ్లు కనిపించడం లేదు. తమ దగ్గర ఉన్న ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని అధికారులను కోరుతున్నా కొనే నాథుడే కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.

ఎక్కడ చూసినా ధాన్యం రాశులే..

నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు లేకపోవడంతో ఎక్కడ చూసినా ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి. పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని పిఠాపురం పట్టణం, గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో సుమారు 18 వేల ఎకరాల్లో వరి పంట కొనుగోళ్లు లేక కళ్లాల్లోనే ఉండిపోయినట్టు రైతులు వాపోతున్నారు. వివిధ సాకులు చూపిస్తూ అధికారులు ధాన్యం కొనుగోళ్లకు వెనకడుగు వేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తే తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో వారికి అమ్మడానికి రైతులు నిరాకరిస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో ఏరోడ్డు పక్కన చూసినా ధాన్య రాశులే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వాతావరణం రోజుకో విధంగా ఉండడంతో ఎప్పుడు ఏప్రమాదం ముంచుకొస్తుందో, పండిన ధాన్యం మళ్లీ ఎక్కడ వరదల పాలవుతాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పిఠాపురం వ్యవసాయ శాఖ ఏడీఏ పి.స్వాతిని వివరణ కోరగా నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి అమ్ముకోవచ్చన్నారు. రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి నష్ట పోవద్దని సూచించారు.



కొండెవరంలో రోడ్డు చెంతనే ధాన్యంరాశులు



కొత్తపల్లి మండలంలో కొనుగోళ్లు లేకపోవడంతో రోడ్డుపై ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు

కాలుష్యంతో మత్స్యకారుల జీవనోపాధికి ముప్పు



జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న మత్స్యకారులు

కొత్తపల్లి: తీరప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి కాలుష్యాన్ని పైపులైన్ల ద్వారా సముద్రంలోకి విడుదల చేయడం వలన మత్స్యకారుల జీవనోపాధికి ముప్పు ఏర్పడుతోందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కాకినాడలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వేదికలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు ఎమ్మెల్సీ పద్మశ్రీ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ మత్స్యకార నాయకులు కలిసి వినతి పత్రం అందించారు. తీరంలో ఏర్పాటు చేసిన పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను పైపులైన్ల ద్వారా సముద్రంలోకి విడుదల చేయడం వలన మత్స్య సంపద అంతరించిపోవడంతో పాటు మత్స్యకారులు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని భయాందోళనలు వ్యక్తం చేశారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, త్వరలోనే పరిశ్రమ యాజమాన్యం, మత్స్యకారులతో సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మత్స్యకార నాయకులు ఉమ్మిడి జాన్, మేరుగు ఎల్లాజీ, గోగు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌పై గోతుల పూడ్చివేత



ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్‌లో నిలిచిపోయిన వాహనాలు

సామర్లకోట: ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అడుగడుగునా గోతులు ఏర్పడటంతో ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యంగా తయారైంది. గోతుల వల్ల భారీ వాహనాలు నెమ్మదిగా వెళుతున్న సమయంలో వెనుక వాహనాలు ఓవర్ టేక్ చేసి రెండో లైనులో రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు బారులు తీసి నిలిచిపోతున్నాయి. గతంలో ఉదయం, సాయంత్రం కార్పొరేట్ కళాశాలకు వెళ్లే బస్సులు వచ్చే సమయంలో ట్రాఫిక్ సమస్య ఉండేది. అయితే ప్రస్తుతం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గోతుల వల్ల ప్రతీరోజు సమయంతో సంబంధం లేకుండా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈ మేరకు ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు సోమవారం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గోతులు పూడ్చే కార్యక్రమం ప్రారంభించారు. కాంక్రీట్ మిక్సింగ్ వాహనాలలో కాంక్రీట్‌తో గోతులు పూడ్చే పనులకు శ్రీకారం చుట్టారు. గోతులపై ఎన్ని పర్యాయాలు ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదు. సుమారు 45 ఏళ్ల క్రితం బ్రిడ్జి కావడంతో ట్రాఫిక్ కొన్ని రెట్లు పెరగడంతో ఈ ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. అచ్చంపేట నుంచి రాక్ సిరామిక్ వరకు జరుగుతున్న జాతీయ రహదారి పనులు పూర్తి అయ్యే వరకు ఈ వంతెనపై ట్రాఫిక్ సమస్య తప్పే అవకాశం కనిపించడం లేదు. అంత వరకు ఈ వంతెనపై పోలీసు సిబ్బంది సంఖ్యను పెంచి ట్రాఫిక్ సమస్య నివారణకు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



వంతెనపై గోతులు పూడ్చిస్తున్న ట్రాఫిక్ ఎస్సై గరగారావు

పని చేసే వారికే ఉపాధి

- డ్వామా పీడీ వెంకటలక్ష్మి
- మండల పరిధిలో సామాజిక తనిఖీ

సామర్లకోట: ఉపాధి హామీ పనుల్లో పని చేసే వారికే అవకాశం ఇవ్వాలని ఉపాధి హామీ సిబ్బందికి డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి ఆదేశించారు. మండల పరిధిలో ఉపాధి హామీ సామాజిక తనిఖీలో భాగంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధి హామీ పనులలో అనేక మంది గట్లపై కూర్చుని ఉంటున్నారని అటువంటి వారికి అవకాశం ఇవ్వవద్దని చెప్పారు. దివ్యాంగులను ఉపాధి హామీ పనులకు దూరంగా ఉంచాలన్నారు. 10 మంది పని చేస్తూ, నలుగురు గట్టుపై కూర్చోవడం వలన 10 మంది పనికి వచ్చే కూలీని 14 మందికి పంచాల్సి వస్తోందని, దీనివల్ల పని చేసే వారు నష్టపోతున్నారని గుర్తు చేశారు. ప్రతి కూలీకి రూ.290 నుంచి రూ.300 రావాలని సూచించారు. ఆ మేరకు కూలీ తగ్గితే ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డు అసిస్టెంట్లపై చర్యలు ఉంటాయని తెలిపారు. పనిని బట్టి కూలీలను నియమించుకోవాలన్నారు. ప్రతీ టెక్నికల్ అసిస్టెంట్ రోజు రెండు గ్రామాలను పర్యటించి మస్టరు, పనిని పరిశీలించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనిలో నాణ్యత ఉండాలన్నారు. పనిముట్లు లేకుండా పని లోనికి వస్తే వారిని వెనక్కు పంపాలన్నారు. నిబంధనలు పాటించాలన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి బ్రేక్ నిర్ణయిస్తామని, పనులను తాము తనిఖీ చేస్తామని, ఆ సమయంలో పని చేయకుండా కూర్చున్న వారిని గుర్తిస్తే మస్టరు వారం రోజుల పాటు తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ పి.వసంతమాధవి, ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి, సోషల్ ఆడిట్ స్టేట్ టీము మేనేజరు వై.గౌరీశంకర్, హెచ్ఆర్ మేనేజరు జి.రాజేష్, ఎస్ఆర్‌పీ సింహాద్రి, ఉపాధి హామీ ఏపీఓ ఆర్.ప్రభాకరరావు పాల్గొన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు.



సామర్లకోట ఉపాధి హామీ సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

రూ.53వేల రికవరీకి చర్యలు

ఉపాధి హామీ సామాజిక తనిఖీలలో 12 గ్రామాలలో జరిగిన పనులకు సంబంధించి అవకతవకలను గుర్తించి రూ.53,542 రికవరీకి పీడీ వెంకటలక్ష్మి ఆదేశాలు జారీ చేశారని ఎంపీడీఓ కె హిమామహేశ్వరి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ప్రారంభం అయిన సామాజిక తనిఖీ ప్రజావేదిక సమీక్ష రాత్రి ఏడు గంటల వరకు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ వివరాలు తెలియజేశారు. ఉండూరు, పసపాడు, పండ్రవాడ గ్రామాలలోని ఫీల్డు అసిస్టెంట్లకు రూ.వెయ్యి నుంచి రూ.నాలుగు వేలు జరిమానా విధించినట్టు తెలిపారు. మండల పరిధిలో 2023–24 వార్షిక సంవత్సరంలో 864 పనులను రూ.8,30,385తో చేపట్టినట్లు ఆమె వివరించారు.

ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి

పిఠాపురం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. పిఠాపురం రథాలపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో సోమవారం నియోజకవర్గ స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు, డీఎల్‌డీఓ కేఎన్వీ ప్రసాదరావు తదతరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను కలెక్టర్ సావధానంగా ఆలకించారు. ఆయా సమస్యలకు సత్వర పరిష్కారం అందించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రధానంగా రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఆక్రమణల తొలగింపు, ఉపాధి కల్పన, సదరం సర్టిఫికెట్ల జారీ తదితర సమస్యలపై 198 అర్జీలు అందాయి. వాటన్నింటినీ పీజీఆర్ఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, అర్జీదారులకు రసీదులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలకు తగిన పరిష్కారం తప్పక అందిస్తామన్నారు. ఒకే సమస్యపై ఫిర్యాదు చేసేందుకు వ్యయప్రయాసలు పడి పదే పదే రానవసరం లేదన్నారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీకి నిర్ణీత సమయంలో సంతృప్తి కరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పిఠాపరం తహసీల్దార్ వేణుగోపాలరావు, మున్సిపల్ కమిషనర్ నామా కనకారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

- అధికారులకు ఆర్డీఓ శ్రీరమణి
- గ్రీవెన్స్‌కు ఏడు అర్జీలు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు (పీజీఆర్ఎస్) ఆర్డీఓ శ్రీరమణి అన్నారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఏడు అర్జీలు అందినట్లు ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. మండల స్థాయిలో తహసల్దార్ కార్యాలయాల వద్ద ఆయా శాఖల మండల స్థాయి అధికారులకు పీజీఆర్‌జీఎస్‌కు అందుబాటులో ఉంటారన్నారు. పీజీఆర్‌జీఎస్‌లో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారిపై ఉంటుందన్నారు. ఈ వారం నిర్వహించిన స్పందనకు తొమ్మిది ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు ఆర్డీఓ శ్రీరమణి తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, గృహ నిర్మాణ శాఖ రవిశంకర్, డీవైఈఓ శర్మ, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరష్కరించాలి

సామర్లకోట: మండల పరిధిలో ప్రతి సోమవారం మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్సులో వస్తున్న సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో ఫిర్యాదులు చేస్తే వారి సమస్యలు పరిష్కారం కావనే అపోహతో అనేక మంది కాకినాడలోని కలెక్టరేట్‌లో తమ ఫిర్యాదులను అందజేస్తున్నారని, ఆ అపోహల నివారణకు ఇక్కడ అందజేసే ఫిర్యాదులకు సత్వరం నాణ్యమైన పరిష్కారాలు చూపాలని ఆదేశించారు. పరిష్కారానికి అవకాశం లేక పోతే అందుకు గల కారణాలను దరఖాస్తుదారులకు తెలియజేయాలని వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భైరవమూర్తి, ఎంఈఓలు పి.పుల్లయ్య, వై.శివరామకృష్ణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాషిణి, ఎంఏఓ ఐ.సత్య, ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి



సామర్లకోటలో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై నేటి నుంచి శిక్షణ

మండల స్థాయిలో పంచాయతీ సర్పంచ్, గ్రేడ్ 1 నుంచి 6 వరకు ఉన్న పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం నుంచి రెండు రోజుల పాటు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే శిక్షణకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై 27 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో 9 అంశాలకు సంబంధించి ఒక్కో అంశానికి మూడు రోజుల పాటు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో జిల్లా స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ పొందిన అధికారులు మండల స్థాయిలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు చెందిన 9 అంశాలను రెండు రోజులలో ఏ విధంగా పూర్తి చేస్తారనే ప్రశ్నలు ఉన్నాయి.


మోగిన నెలగంట

- ఘనంగా ధనుర్మాసోత్సవాలు ప్రారంభం
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు


పిఠాపురం: నియోజకవర్గంలోని ఆలయాల్లో నెలగంట మోగింది. ఏటా మకర సంక్రాంతికి నెలరోజుల ముందు నెలగంట మోగించి ధనుర్మాసోత్సవాలను ప్రారంభిస్తారు. దీనిలో భాగంగా సోమవారం తెల్లవారుజామున 4.56 గంటలకు ఆలయాల్లో నెలగంట మోగించి ధనుర్మాసోత్సవాలకు శ్రీకారం చుట్టారు. కాగా ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి పనులు ఊపందుకున్నాయి. ఆలయాల్లో వచ్చే నెల 14వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నారు.

కుంతీమాధవస్వామి ఆలయంలో..

పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన పిఠాపురంలో వేంచేసిన కుంతీమాధవస్వామి వారిని ధనుర్మాస మహోత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ శ్రీరాములు తెలిపారు. తొలిరోజు సోమవారం స్వామివారికి, గోదా అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చనలు, శ్రీచూర్ణం అర్చనలు, ద్రవిడ ప్రబంధ పారాయణ నివేదనలు, గ్రామోత్సవం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే వేణుగోపాలస్వామివారి ఆలయంలో ధనుర్మాస వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి నాడు స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కనుమ పండగ రోజు స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్టు అర్చకులు విజయ జనార్ధనాచార్యులు తెలిపారు. ధనుర్మాసంలో భక్తులు స్వామివారిని దర్శించి తరించాలని ఈఓ నున్న శ్రీరాములు కోరారు. అలాగే పిఠాపురం నియోజకవర్గంలోని కొత్తపల్లి గొల్లప్రోలు, పిఠాపురం మండలం, పట్టణంలో వేంచేసిన అన్ని ప్రముఖ దేవాలయాల్లోనూ నెలగంట మోగింది. నెలరోజుల పాటు నిర్వహించే ఉత్సవాల కోసం ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు.



సామర్లకోటలోని భీమేశ్వరస్వామి



పిఠాపురంలోని కుంతీ మాధవునికి విశేష పూజలు

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. స్వామి వారికి ప్రీతికరమైన సోమవారం కావడంతో ఆలయంలో తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామి వారి అభిషేకాలు, పూజలను పిఠాపురం మహారాజా గోత్రనామాలతో నిర్వహించారు. అలాగే లక్షపత్రి పూజలు జరిగాయి. ఆలయానికి వచ్చిన భక్తులు ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరిణి నుంచి నీళ్లను తీసుకువచ్చి స్వయంగా అభిషేకించారు. ఆలయంలోని పెద్ద నంది, మూలవిరాట్ ఉప ఆలయాలు, స్వామి వారిని అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం ప్రసాదం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లికి రాజగోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకటరామ, వెంకట సుందరరామమూర్తి, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ పూజలు నిర్వహించారు. అలాగే స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు చేశారు.



పిఠాపురంలో వేణుగోపాలస్వామి